
సాక్షి విజయనగరం

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



అంతా..ఉత్త గ్యాసే!

ఏడు నెలల కూటమి పాలనలో అంతా గ్యాస్ కొట్టే మాటలే తప్ప చేసి చూపించిన దాఖలాలు లేవని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

- 8లో



నేడు మోదీతో ముఖాముఖి

పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏటా 'పరీక్షా పేచర్చ' కార్యక్రమంలో భాగంగా పీఎం మోదీ నేరుగా వారితో మాట్లాడుతున్నారు.

- 8లో

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడిలలో ఏర్పాటు చేసిన హుండీల ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో సోమవారం లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ వీవీ సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తిగల భక్తులు, సేవకులు పాల్గొనవచ్చునని తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ రెండో సంవత్సర ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా 93 పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయని ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. పరీక్షలకు హాల్‌టికెట్లను ఇంటర్ విద్యా మండలి ఇప్పటికే విడుదల చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతుండగా ఈ పరీక్షలు కూడా ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు 14,470 మంది, బైపీసీ విద్యార్థులు 4,053 మంది పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను వారి కళాశాలల లాగిన్‌లోను, 'బీఐఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రకటించారు. పరీక్ష కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

మూడు లక్షల మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు

● డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి



విజయనగరం ఫోర్ట్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉన్న మూడు లక్షల మంది విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ నిమిత్తం ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. అల్బెండజోల్ మాత్రను నమిలి మింగవలసి ఉంటుందన్నారు. దీని వల్ల పిల్లల్లో ఉండే నులిపురుగులు నశించి రక్తహీనత బారిన పడకుండా ఉంటారని తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా సంవత్సరానికి రెండు సార్లు నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. గుర్ల మండలంలో ఫైలేరియా వ్యాధిని నియంత్రించడానికి ఈ నెల 10 నుంచి 27వ తేదీ వరకు మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రెండు సంవత్సరాల పైబడిన వయసు వాళ్లందరికీ డీఈసీ మాత్రలు మింగించనున్నామన్నారు. ఫైలేరియా వ్యాధి లక్షణాలు బయటికి రావడానికి 10 నుంచి 15 సంవత్సరాలు పడుతుందని తెలిపారు. 10, 11, 12 తేదీలలో గుర్ల మండలంలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు వద్ద మాత్రమే మాత్రలు మింగించే కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.


మంత్రి సంధ్యారాణి విమర్శలు సరికాదు..!



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తన స్థాయిని మరచి, అహంకారంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మండిపడ్డారు. పట్టణంలోని తన గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం, పదవులు శాశ్వతం కాదన్న విషయం సంధ్యారాణి గుర్తించాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు ఎప్పుడు చేస్తారని, ప్రజా సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారని చెప్పారు. దీనిపై సమాధానం చెప్పాల్సిన కూటమి నేతలు తమ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పదవులు చేసిన తాను ఏనాడు తప్పుడు విమర్శలు చేయలేదని గుర్తు చేశారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను సంధ్యారాణి పరిష్కరించేందుకు నేడు చొరవ చూపడం లేదన్నారు. కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తుంటే అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒడిశా అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికి అడుగులు ముందుకు వేశారన్నారు. నేడు ఒడిశాలో కూడా కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన బీజేపీ అధికారంలో ఉండగా కొఠియా గ్రామాల సమస్యల పరిష్కారానికి మంత్రి సంధ్యారాణి ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రశ్నించాలని ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పారని నేడు ఆ హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే విమర్శలు చేస్తారా? అంటూ మండిపడ్డారు.

అంతా మా ఇష్టం!



● ఎవరి మాట వినం! ● స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల మాట అసలు వినం!
● ఇదీ జిల్లాలో అధికారుల తీరు ● గతంలో ఎన్నడూ లేని సంస్కృతికి బీజం
● ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే ఆగ్రహంతో ఊగిపోతున్న వైనం
● ప్రభుత్వ కార్యాలయాల్లోనే ప్రజాప్రతినిధులకు అవమానం

● పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఇలా..

● వేపాడ మండలం బానాది గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఏఎస్ఎస్ మూర్తి అధికార టీడీపీ నాయకుల సిఫారసులతో పోస్టింగ్ వేయించుకున్నందుకు కృతజ్ఞత చూపిస్తున్నారు. సర్పంచ్ కర్రి యశోదకు కనీస గౌరవం ఇవ్వకుండా అవమానిస్తున్నారు. ఆయన తీరుపై రెండుసార్లు జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా ఆమె వేదన అరణ్యరోదనే అయ్యింది. గ్రామ పంచాయతీ రికార్డులు సైతం ఆమె కంటికి కనిపించకుండా చేసేశారు. పలుమార్లు విజ్ఞప్తి చేసినా గ్రామ సభ కూడా నిర్వహించలేదు. చివరకు ఆమె దానపట్టా ఇచ్చిన స్థలంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని టీడీపీ నాయకులు చెప్పినట్లు గత నెల 20వ తేదీన రైతుభరోసా కేంద్రం భవనంలోకి మార్చేశారు. సదరు గ్రామ సర్పంచ్‌కే కాదు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకపోయినా ప్రభుత్వ కార్యాలయాన్నే ఒక పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి మార్చేయగలిగారంటే అధికార యంత్రాంగం తీరు ఎలా ఉందో అర్థమవుతోంది.

తహసీల్దార్ తీరిలా...

● గజపతినగరం మండలం మధుపాడ గ్రామ సర్పంచ్ కడుపుట్ల పైడిపునాయుడును తహసీల్దారు రత్నకుమార్ దూషించిన తీరు రెండ్రోజుల క్రితం సంచలనమైంది. గ్రామానికి ప్రథమ పౌరుడిగా సర్పంచ్ హోదాలో తన గ్రామ సమస్యపై ప్రశ్నిస్తే సదరు అధికారి ఆగ్రహంతో ఊగిపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ ప్రైవేట్ లేఅవుట్‌కు రహదారి సదుపాయం కోసం సాగునీటి కాలువ (జీసీ కెనాల్)ను ఆక్రమించి కల్వర్టు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించడమే ఆ సర్పంచ్ చేసిన తప్పు.

ఏహే బయటకు పో.. ముందు మర్యాదగా బయటకు పో.. అంటూ తహసీల్దారు దూషించారంటేనే ఈ ప్రభుత్వంలో పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది.

అధికారుల తీరు సరిగాలేదు...



స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పట్ల అధికారుల తీరు సరిగా ఉండట్లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక సమస్యలపై ప్రశ్నిస్తే అందుకు పరిష్కారమేమిటో చూపించాల్సిన అధికారులే... అదేదీ చేయకుండా ప్రజాప్రతినిధులను దూషిస్తే ప్రయోజనం ఉండదు. కచ్చితంగా ఇలాంటి దుష్ప్రవర్తన కలిగిన అధికారులు తమ తీరు మార్చుకోవాలి. బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రభుత్వ కార్యాలయాలకు తమ సమస్యలను చెప్పడానికి వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధుల పట్ల హుందాగా వ్యవహరించాలి.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారుల తీరుతెన్నుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో రచించిన భారత రాజ్యాంగం కన్నా టీడీపీ నాయకుడు లోకేష్ రాసుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందన్న విమర్శలకు జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు అద్దం పడుతున్నాయి. అధికార పార్టీ నాయకులతో అంటకాగుతూ కొంతమంది అధికారులు వారి అండ ఉందన్న ధైర్యంతో రెచ్చిపోతున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై దూషణలకు దిగుతున్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినా తట్టుకోలేకపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే వారిని తీవ్రంగా అవమానిస్తున్నారు. ఇది సరైన విధానం కాదని, గతంలో ఎన్నడూ లేని విష సంస్కృతికి ఇప్పుడు కొంతమంది అధికారులు బీజం వేస్తున్నారని ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు అధికారులు గౌరవం ఇవ్వాల్సిందేనని హితవు పలికారు.

'కూటమి' నేతలతో అంటకాగుతూ..

పసుపు బిళ్ల పెట్టుకొని ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే కూటమి పార్టీల నాయకులకు కుర్చీ వేసి, టీ ఇచ్చి మర్యాదగా వారు చెప్పే పనులు చేయక పోతే... అలాంటి అధికారులకు శంకరగిరి మాన్యాలు చూపిస్తామని టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బహిరంగంగానే చేసిన హెచ్చరికల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో అంటకాగుతూ జిల్లాలో పలువురు అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష చూపిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా పని చేయాలన్న కనీస నైతిక ధర్మాన్నీ పక్కన పెట్టేస్తున్నారు. 'పచ్చచొక్కా', 'ఎర్రకండువా' వేసుకోలేదు తప్ప ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను అవమానించడంలో 'కూటమి' పార్టీల నాయకులను మించిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల కఠినత్వం

భూసమస్యలన్నీ పరిష్కరిస్తామని ఇటీవల ఊరూరా జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 'కూటమి' ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరించారనడానికి మెరకముడిదాం మండలం బుదరాయవలస గ్రామంలో జరిగిన సంఘటనే నిదర్శనం. మాజీ సర్పంచ్ బాలి బంగారునాయుడి కుమారుడు మహేష్ రెవెన్యూపరమైన సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. మరణించిన తల్లిదండ్రులకు సంబంధించిన భూములను వారి వారసుల పేరున ఆన్‌లైన్‌లో పొందపరచాలని కోరారు. అయితే తాము రిజిస్ట్రేషన్ అయిన భూములైతేనే పరిష్కరిస్తామని, మిగతా వాటి గురించి ప్రస్తావించవద్దని తహసీల్దార్ అజూరఫీజాన్, డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు కటువుగా సమాధానమిచ్చారు. 'ప్రభుత్వం ఏమి సూచిస్తే వాటినే చేస్తాం. నచ్చితే చేయించుకో.. లేకపోతే లేదు. మాతో వాదించవద్దు' అంటూ బాలి మహేష్‌పై ఆగ్రహంతో ఊగిపోవడం చూసి ప్రజలంతా విస్తుపోయారు.

అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే..

వంగర మండలంలో తహసీల్దారు డి.ధర్మరాజు, సంతకవిటి ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ పూర్తిగా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే పని చేస్తున్నారని ఆయా మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు కొద్దిరోజులుగా గగ్గోలు పెడుతున్నా వారి తీరు మారట్లేదు. అధికార పార్టీ నేతలు చెప్పిన పనులే చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ వంగర మండల అధ్యక్షుడు కరణం సుదర్శనరావు ఆరోపిస్తున్నారు.



నందివానివలసలో గజరాజులు



తామర చెరువులో సంచరిస్తున్న గజరాజులు

గరుగుబిల్లి: మండలంలోని నందివానివలసలో గజరాజుల గుంపు ఆదివారం ఉదయం దర్శనమిచ్చింది. కొన్నేళ్లుగా కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం మండలాలలోనే ఏనుగులు సంచరిస్తున్నాయి. కొమరాడ మండలం కళ్లికోట, విక్రంపురం, మార్కొండపుట్టి తదితర గ్రామాల మీదుగా నందివానివలస చేరుకొని తామర చెరువుకు చేరాయి. ప్రస్తుతం ఆయా గ్రామాలలో అరటి పంటలున్నాయి. పంటలను నాశనం చేయడంతో పాటు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించి ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం షాపుల లాటరీ వాయిదా



సాక్షి ప్రతినిధి, విజయనగరం: కల్లుగీత, సొండి కులాలకు సంబంధించి ఈ నెల 10న జరగాల్సిన మద్యం షాపుల లాటరీ వాయిదా పడిందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎలక్షన్ నిమిత్తం మోడల్ కోడ్ అమలులో ఉన్నందున సొండి కులాలకు కేటాయించిన మద్యం షాపుల లాటరీ వాయిదా పడినట్లు ఆయన తెలిపారు. ఎలక్షన్ కమిషనర్ అనుమతి వచ్చిన వెంటనే తదుపరి లాటరీ తేదీని ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

రెల్లి భూములను పరిశీలించిన డీజీపీ

● గ్రేహౌండ్స్ యూనిట్ ఏర్పాటు చేసే యోచన
● పర్యటన మీడియాకు తెలియకుండా గోప్యం

కొత్తవలస : మండలంలోని రెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 1–8లో 526 ఎకరాల భూములను రాష్ట్ర డీజీపీ హరీష్‌గుప్త గ్రేహౌండ్స్ డీఐజీ కె.ప్రవీణ్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ భూములను 2017వ సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి కేటాయించారు. సదరు భూముల్లో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి నిబంధనలు అడ్డు రావడంతో గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాలూరు నియోజకవర్గంలో 561 ఎకరాల భూములను సేకరించి అక్కడ నిర్మాణాలు చేశారు. దీంతో అప్పటి నుంచి కొత్తవలసలో భూములు ఖాళీగా వుండడంతో గ్రేహౌండ్స్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. గత కొద్ది నెలలు క్రితం పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఇక్కడ పర్యటించి భూములను పరిశీలించారు. ప్రస్తుతం డీజీపీ హరీష్‌గుప్త గ్రేహండ్స్ డీజీపీ కె.ప్రవీణ్, మరో 10 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు సదరు భూములను పరిశీలించారు. ఎస్పీ వకుల్ జిందల్, జేసీ సేతుమాధవన్, ఆర్డీఓ దాట్ల కీర్తి, స్థానిక తహసీల్దార్ బి.నీలకంఠరావు ఉన్నారు.

అంతా గోప్యం..

ఇదిలా ఉండగా రాష్ట్ర డీజీపీ పర్యటనను అధికారులు గోప్యంగా ఉంచారు. మీడియాను అనుమతించలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే గోప్యంగా ఉంచామని తెలిపారు. వీరి పర్యటనను కవరేజి చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోనే పోలీసులు నిలువరించారు.

కనుల పండువగా సూఫీ సుగంధ మహోత్సవం

● భక్తులతో కిటకిటలాడిన దర్గా, దర్బార్
● నేటితో ముగియనున్న ఉరుసు మహోత్సవాలు

విజయనగరం టౌన్: సూఫీ సెహన్షా, ఆధ్యాత్మిక చక్రవర్తి హుజూర్ హజరత్ సయ్యద్ బాబా ఖాదర్ వలీ 66వ ఉరుసు సుగంధ మహోత్సవం ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా, దర్బార్ జనసంద్రంతో నిండిపోయి పండగ శోభను సంతరించుకుంది. సూఫీ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన ప్రత్యేక ప్రార్థనలు, దివ్యమైన ఘట్టాలను చీమలపాడు దర్గా పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్, విజయనగరం దర్గా, దర్బార్ పీఠాధిపతి డాక్టర్ ఎండి. ఖలీలుల్లా షరీఫ్‌ల నేత్రత్వంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబా దివ్య సమాధికి కొత్త సుగంధాన్ని పూయించి, పరిమళ ద్రవ్యాలతో కొత్త చాదర్ వేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై నిలబెట్టగానే భక్తులు ఖాదర్‌బాబాకు నినాదాలు చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక కళారూపాలు, మేళతాళాలు, డ్రమ్ము వాయిద్యాలు, ఫకీర్ కవ్వాలీతో వేలాది భక్తులు వెంటరా గా బాబా సందల్ (ఊరేగింపు) దర్బార్ నుంచి ప్రారంభమైంది. బాబా మెట్ట నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఆబాద్ వీధి, అంబటి సత్రం మూడు లాంతర్లు మీదుగా నగర పురవీధుల్లో సాగింది. దారి పొడవునా భక్తులు బాబా రథానికి ఎదురు వెళ్లి కొబ్బరి కాయలు కొట్టి, పూజలు చేశారు. దర్బార్ లంగర్ ఖానాలో నిర్వహించిన భారీ అన్నసమారాధన ద్వారా లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో టూటౌన్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా కృషి చేశారు. సోమ వారం ఉదయం ఖురాన్ పఠనం, సందల్, చాదర్ సమర్పణ తదితర వాటితో కార్యక్రమాలు ముగుస్తాయి.



ఖాదర్‌బాబా చిత్రపటంతో భారీ ఊరేగింపు

పదోన్నతులకు సీనియార్టీ కసరత్తు



● ప్రత్యేక బృందాలతో పరిశీలన
● ఆన్‌లైన్ అప్లోడ్‌కు సాంకేతిక ఇబ్బందులు
● పట్టించుకోని రాష్ట్ర స్థాయి విద్యా శాఖ
● 1989 డీఎస్సీ నుంచి 2018 డీఎస్సీ వరకు జాబితా
● ఈ నెల 10వ తేదీలోపు జాబితా పూర్తి చేసేలా చర్యలు

విజయనగరం అర్బన్:

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నా.. బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నా... డీఎస్సీ పరీక్షలు నిర్వహించాలన్నా.... ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసు, వారి సీనియార్టీ, రోస్టర్ పాయింట్లతో పాటు పోస్టుల పరిస్థితిపై విద్యా శాఖకు స్పష్టత ఉండాలి. అయితే సీనియార్టీ జాబితా కచ్చితత్వంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా వరకు ప్రక్షాళన చేపట్టింది. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సీనియార్టీ జాబితాను ప్రస్తుత రాష్ట్ర విద్యా శాఖ అధికారులు మరోసారి సిద్ధం చేసేందుకు కసరత్తు చేపట్టారు. ఈ కసరత్తు సోమవారంలోపు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 34 మండలాల పరిధిని పరిగణనలోకి తీసుకొని జాబితాను తయారు చేస్తున్నారు. 34 మండలాల ఉమ్మడి జిల్లాలో 2,155 ప్రాథమిక, 211 ప్రాథమికోన్నత, 451 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో వివిధ కేడర్‌లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను సిద్ధం చేసే పనిలో డీఈఓ కార్యాలయ సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ నుంచి హెచ్ఎం కేడర్ వరకు ఉన్న టీచర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక బృందాల నియామకం

ఈ కసరత్తును ఉమ్మడి విజయనగరం జిల్లా నోడల్ అధికారి కేడర్‌లో ఉన్న డీఈఓ యు.మాణిక్యంనాయుడు పర్యవేక్షిస్తున్నారు. సీనియార్టీ జాబితాను తయారు చేయడానికి వివిధ కేడర్ ఉపాధ్యాయులతో కూడిన ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందానికి ఇద్దరు చొప్పున ఏర్పరచుకొని తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో అప్లోడ్ ప్రక్రియ స్థానిక డీఈఓ కార్యాలయంలో చేపడుతున్నారు. ఈ నెల 10వ తేదీలోపు కసరత్తును పూర్తి చేసి రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు జాబితాను పంపేలా చర్యలు తీసుకుంటున్నారు.



డీఈఓ కార్యాలయం

సీనియార్టీ జాబితా ప్రక్రియ ఇలా...

ఉమ్మడి జిల్లాలో 1989వ సంవత్సరం డీఎస్సీ నుంచి 2018వ సంవత్సరం డీఎస్సీ వరకు కేడర్ వారీగా సీనియార్టీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఉపాధ్యాయుల నుంచి వారి విద్యార్హత, డీఎస్సీ పోటీ పరీక్షల్లో లభించిన మార్కులు తదితర వివరాలను అన్ని మండలాల్లో ఎంఈఓలు తొలిత సేకరించి డీఈఓ కార్యాలయానికి వివరాలు పంపుతున్నారు. వివిధ డీఎస్సీ నియామకాలు, 610 నియామకాలు, అంతర్ జిల్లాల, అంతర్ రాష్ట్రాల బదిలీలలో వచ్చిన ఉపాధ్యాయుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఆ వివరాలను డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు రికార్డుల ఆధారంగా మరోసారి పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 4,260 మంది ఎస్జీటీ కేడర్, 3,640 మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్, 210 హెచ్ఎం పోస్టుల సీనియార్టీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

ఆన్‌లైన్ అప్లోడ్‌కు సాంకేతిక ఇబ్బందులు

గడిచిన వారం రోజులుగా ఈ తంతు సాగుతోంది. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉండడం వల్ల ప్రతి రోజూ సాంకేతిక ఇబ్బందులు రావడంతో జాప్యం జరిగింది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఈ సమస్య వెంటనే పరిష్కారం అయ్యేది కాదు. దీంతో మాన్యువల్‌గా వివరాల ఎంట్రీ, పరిశీలన వంటి పనులు చేయాల్సి వచ్చిందని తెలుస్తోంది.

సీనియార్టీ జాబితా సిద్ధమవుతోంది..



ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని 34 మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారులు ఆదేశించిన నియమ, నిబంధనలను, మార్గదర్శకాలను పాటిస్తూ కసరత్తు చేస్తున్నాం. అన్ని కేటగిరీల టీచర్ పోస్టులకు చెందిన ప్రతి ఉపాధ్యాయుడి వివరాలను ఆన్‌లైన్‌లో క్రోడీకరించాల్సి ఉంది. ఈ నెల 10వ తేదీకి పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ దాదాపు చివరి దశకు వచ్చింది.

–యు.మాణిక్యంనాయుడు, డీఈఓ

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

తెర్లాం: ఎనిమిదేళ్ల బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్సై సాగర్‌బాబు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం గ్రామంలోని బీసీ కాలనీ(టిన్నుల కోలనీ)కి చెందిన బాలిక శనివారం రాత్రి తినుబండారాలు కొనుగోలు చేసుకునేందుకు దుకాణానికి వెళ్లింది. దుకాణం నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కంకణాల కిరణ్ అనే వ్యక్తి ఆ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక ఏడ్చుకుంటూ వెళ్లి ఆ వ్యక్తి తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. బాలిక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెళ్లి కిరణ్‌ను గట్టిగా నిలదీయడంతోపాటు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజర్వ్ మద్యం షాపుల లాటరీ వాయిదా

పార్వతీపురంటౌన్: రిజర్వ్ మద్యం షాపుల లాటరీ వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు జిల్లా పరిధిలో గల నాలుగు రిజర్వ్ షాపులకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న లాటరీ విధానం ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ అమలులో ఉన్న కారణంగా వాయిదా వేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అనుమతి వచ్చిన వెంటనే లాటరీ తేదీని ప్రకటిస్తామన్నారు.

యువకుడి ఆత్మాహత్యాయత్నం

- సైబర్ మోసానికి గురై మనస్తాపం

పార్వతీపురం రూరల్: సైబర్ మోసానికి గురైన ఓ యువకుడు మనస్తాపంచెంది పురుగు మందు తాగి శనివారం రాత్రి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పార్వతీపురం ఔట్ పోస్టు పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోరి గంగాపురం గ్రామానికి చెందిన రాయల శంకరరావు ఎవరివద్ద అయినా రూపాయి నోటు ఉంటే ఆనోటుకు రూ. 12 లక్షలు వస్తాయన్న ప్రకటన యూట్యూబ్‌లో చూసి ఆశపడి రూ. 2లక్షల వరకు చెల్లించాడు. ఇంకా డబ్బులు చెల్లించాలి. లేదంటే మీఖాతా బ్లాక్ అయిపోతుందని తెలియజేయడంతో మళ్లీ శనివారం సాయంత్రం మరో రూ.70 వేలు చెల్లించాడు. మీరు సరైన సమయానికి డబ్బులు చెల్లించలేదు. కాబట్టి మీకు డబ్బులు రావని చెప్పడంతో మనస్తాపంచెంది గడ్డి మందు తాగేశాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనంద్వారా తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు రూరల్ ఏఎస్సై ఎస్.భాస్కరరావు తెలిపారు.

చెరకులారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాజాం సిటీ: మండల పరిధిలోని గురవాం–బూరాడ గ్రామాల సమీపంలో చెరుకు లారీ బోల్తాపడింది. పరిమితికి మించి లోడుతో సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది.ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపై లారీ పడడంతో ఇటు గురవాం అటు బూరాడ వరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అధికలోడుతో వెళ్తున్న వాహనాలపై పోలీసులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య?

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న రజని

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట గ్రామానికి చెందిన జన్ని రజని(32) అనే వివాహిత ఆదివారం ఉదయం భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్(పీటీజీ)ను ఆనుకుని ఉన్న సొంత జీడితోటలో ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు సంఘటన స్థలం వద్ద గడ్డిమందు కూడా లభ్యమైంది. అయితే ఇది హత్యా? ఆత్మహత్యా అన్న విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రజని తండ్రి దండాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎల్విన్‌పేట ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. ఇదిలా ఉండగా రజని భర్త ఉదయ్‌కుమార్ కలెక్టరేట్‌లో రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. వారికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

- గ్యాస్ సబ్సిడీ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతన్న లబ్ధిదారులు
- 60 శాతం మందికి పడని సబ్సిడీ
- ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం
- తీరా ఇచ్చింది ఒక్కటే
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



అంతా.. ఉత్త గ్యాసే!



వీరఘట్టం/సీతంపేట: ఈఫొటోలో ఉన్న సీతంపేట మండలం రాజన్నగూడకు చెందిన మహిళ పేరు సవర సరోజిని. ఈమె 30–12–2024న హెచ్‌పీ గ్యాస్‌ను రూ.860లు చెల్లించి విడిపించింది.గ్యాస్ సబ్సిడీ వస్తుందని నలభై రోజులుగా ఎదురుచూస్తోంది. ఇంతవరకు చిల్లిగవ్వ కూడా గ్యాస్ సబ్సిడీ పడలేదు. ఈమె ఒక్కరే కాదు జిల్లాలోని సుమారు వేల సంఖ్యలో గ్యాస్ లబ్ధిదారులకు రోజులు, నెలలు గడుస్తున్నా సబ్సిడీ డబ్బులు పడకపోవడంతో కూటమి ప్రభుత్వం తీరుపై మండి పడుతున్నారు.

ఏడు నెలల కూటమి పాలనలో అంతా గ్యాస్ కొట్టే మాటలే తప్ప చేసి చూపించిన దాఖలాలు లేవని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పాలన అంతా సిలిండర్ ఉందే తప్ప .. అందులో గ్యాస్ లేదని ఎద్దేవా చేస్తున్నారు.ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం తీరా చూసేసరికి ఈ ఏడాది మార్చి వరకు ఒకటే ఇచ్చిందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.అయితే ఏ కొందరికో డబ్బులు వేసి మేం అందరికీ ఇస్తున్నాం అని గొప్పలు చెప్పుకుంటోంది.గతేడాది 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది మార్చి వరకు ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చి మూడు సిలిండర్‌లు ఇచ్చామన్నట్లుగా కలరింగ్ ఇస్తోంది. ఇదంతా తెలిసిన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా చేసే వంట గ్యాస్ పథకంలో ఆదిలోనే హంసపాదుగా మారింది.మహిళలకు కానుకగా గతేడాది దీపావళి పండగ నుంచి ఉచిత గ్యాస్ ఇస్తున్నట్లు ప్రకటించారు.అయితే దీపావళి పోయే..సంక్రాంతి పోయే వరకు గ్యాస్ సబ్సిడీ నగదు పడిన దాఖలాలు లేవు. నిజానికి ఇప్పటికే రెండు సిలిండర్లు ఇవ్వాలి. కానీ 2024 నవంబర్ నెలాఖరు వరకూ మొదటి సిలిండరు డబ్బులు కూడా జమ కాలేదు.గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి నెలకొంది.

48 గంటల హామీ అమలు ఏమైంది..

వంటగ్యాస్ వినియోగదారులకు గ్యాస్ అందించిన 48 గంటల్లో సబ్సిడీ డబ్బు బ్యాంకు ఖాతాల్లో వేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది.అయితే ఇంతకీ గ్యాస్ తెచ్చుకున్న 60 శాతం మందికి నగదు పడలేదని, సబ్సిడీ డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ పాస్‌బుక్ చేతబట్టుకుని తిరగాల్సి వస్తోందని మహిళలు మండిపడుతున్నారు.దీనికి నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో ఏమీ తెలియని దుస్థితి. పాలకులు మాత్రం అందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు.గ్యాస్ డెలివరీ చేసి 48 గంటల్లోపు సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. కానీ నవంబర్ లోపు గ్యాస్ బుక్ చేసుకున్న వారికి మూడు నెలలు గడుస్తున్నా వేలాది మంది లబ్ధిదారులకు డబ్బు జమ కాలేదు.

జిల్లాలో 1.60 లక్షల గ్యాస్ కనెక్షన్లు

పార్వతీపరం మన్యం జిల్లా వ్యాప్తంగా భారత్, హెచ్‌పీ, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఈ గ్యాస్ ఏజెన్సీల పరిధిలో సుమారు 1.60 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.అందులో ఉజ్వల, పీఏయూవై, దీపం, జనరల్ కనెక్షన్లు ఉన్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు తమ పరిధిలోని గ్యాస్ వినియోగదారులకు నిరంతరం ఇళ్లకు గ్యాస్ సరఫరా చేస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. ఇలా ప్రకటించిన వారం రోజులకు కొంతమంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో అక్కడక్కడా సబ్సిడీ జమ చేశారు. మిగిలిన వారికి ఇంతవరకూ డబ్బులు ఖాతాల్లో వేయడం లేదు.

ఇంకా డబ్బు పడలేదు



నేను 1.11.2024న హెచ్‌పీ గ్యాస్ బుక్ చేశాను. 4.11.2024న గ్యాస్ వచ్చింది.రూ.860లను గ్యాస్ కంపెనీ కుర్రోళ్లకు చెల్లించి సిలిండర్ తీసుకున్నాను.మరుసటి రోజు గ్యాస్ కంపెనీ డబ్బులు పడతాయని ,బ్యాంకులో తీసుకోండని చెప్పారు. 6.11.2024న రూ.10.62 పైసలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.816.89 పైసలు సబ్సిడీ వస్తుందన్నారు. కానీ ఇంతవరకు ఆ డబ్బులు పడలేదు.ఎవరిని అడగాలో తెలియక బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాను.ఎవరిని అడిగినా నాలుగు రోజులు అగండి అని చెబుతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలి. ఎస్.తిరుమల రావు

సబ్సిడీ కోసం ఎవరిని అడగాలో?

ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించిన సమస్యలు ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీ డబ్బులు ఎందుకు పడలేదని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే పౌరసరఫరాల కార్యాలయంలో అడగమని అంటున్నారు. అక్కడికి వెళ్తే బ్యాంకు ఈకేవైసీ చేయించాలంటున్నారని, ఈకేవైసీ చేయించామని చెప్తే, గ్యాస్ ఆఫీసుకు వెళ్లి చెప్పమని అంటున్నారు.దీంతో ఉచిత గ్యాస్ పథకం కూటమి ప్రభుత్వ మాయగా మారిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడడంతో ఇలా ప్రజలను ఇబ్బందులు పెడుతోందని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి.

అందుబాటులో టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని 7 ఆసుపత్రుల్లో అందుబాటులో టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని డీసీహెచ్‌స్ డాక్టర్ బి. వాగ్దేవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుండెపోటుకు ఎమర్జెన్సీగా ఇచ్చే ఇంజక్షన్‌లు పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, సాలూరు, పాలకొండ, సీతంపేట ఏరియా ఆస్పత్రులు, కురుపాం, చినమేరంగి, భద్రగిరి సీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. గుండెపోటుకు ఇచ్చే టేనెక్టివ్ ప్లస్ ఇంజక్షన్ సుమారు రూ: 45,000ల ఖరీదైనది జిల్లాలోని 7 ఆస్పత్రుల్లో ఉచితంగా లభిస్తుందన్నారు. ఛాతీ నొప్పి, ఆయాసం తదితర గుండెపోటు లక్షణాలు గల రోగులు నేరుగా గానీ 108లో గాని, ఏదైనా వాహనంలో గానీ త్వరగా ఈ ఆస్పత్రులకు చేరుకోవాలని సూచించారు. ఈసీజీ తీసి ఆన్‌లైన్‌లో కార్డియాలజిస్టును సంప్రదించి గుండెపోటును నిర్ధారించిన వెంటనే టేనెక్టివ్ ప్లేస్ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడే చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు.



డాక్టర్ బి.వాగ్దేవి, డీసీహెచ్‌ఎస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

సత్తా చాటిన దివ్యాంగుల క్రికెట్ జట్టు

- గుంటూరు విజ్ఞాన యూనివర్సిటీలో పోటీల నిర్వహణ

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా దివ్యాంగ క్రికెట్ జట్టు రాష్ట్ర క్రికెట్ పోటీలలో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరులోని విజ్ఞాన యూనివర్సిటీ ఉత్సవాల్లో భాగంగా ఈనెల–7,8 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా దివ్యాంగ జట్టు కెప్టెన్ కేవటి శ్రీను ఆధ్వర్యంలో టీమ్ ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీ, నగదు బహుమతి అందుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న 2024 పారా ఒలెంపిక్ బ్రౌంగ్ మెడలిస్ట్, ఇండియన్ పారామిలటరీ పిస్టల్ షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. ఈ జట్టులో అత్యధింకంగా భామిని మండలానికి చెందిన వారే ఉన్నారు. కెప్టెన్ కేవటి శ్రీను(నేరడి–బి), వలరౌతు డిల్లీశ్వరరావు(కీసర), గొడో సంతోష్(కాట్రగడ–బి), రాయవలస వినోద్ (గురండి), బాణాల నరేష్(పాలకొండ)తో పాటు 11 మంది జిల్లా క్రీడాకారులున్నారు.



రాష్ట్రస్థాయి ట్రోఫీతో జిల్లా దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు

తోటపల్లికి పూర్వవైభవం

- ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

గరుగుబిల్లి: చినతిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషిచేస్తున్న అభివృద్ధి కమిటీ సేవలు అమూల్యమని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ.శంకరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్రను, ప్రస్తుతం నిర్వహించిన నిర్మాణాలను, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై టీటీడీ ఎగ్జిక్యూటివ్ డా.డి.పారినాయుడు ఆయనకు వివరించారు. అనంతరం ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ భక్తుల విరాళాలతో టీటీడీ సేవా ట్రస్టు ఆలయ నిర్మాణానికి ముందుకువచ్చి అద్భుతంగా నిర్మించడం అభినందనీయమన్నారు. దేవాలయ ప్రాంగణంలో జ్ఞానజ్యోతి ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయడం ఎంతో మంచి నిర్ణయమన్నారు. ఆలయ నిర్మాణం, విగ్రహప్రతిష్ట, స్వామివారి వార్షిక కల్యాణం నిర్వహించడంతో ఈప్రాంతానికి కొత్త రూపం సంతరించుకున్నట్లు ఉందన్నారు. ఆలయ చరిత్ర పుస్తకాన్ని, క్యాలెండర్‌ను డీవీజీ దంపతులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు టి.దుర్గారావు, ఎం.ప్రకాశ్ రావు, రథో మాస్టారు, కొండలరావు, హరిప్రసాద్, బి.శ్రీహరి, ఎ.వైకుంఠరావు పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు దంపతులు

రోడ్డు టెర్రర్: ఒకే రోజు రెండు రోడ్డు ప్రమాదాలు

- ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

బొండపల్లి: జాతీయ రహదారి26 ప్రమాదాలకు నిలయంగా మారింది. పోలీసులు సంబధిత శాఖలకు చెందిన అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. బోడసింగి పేట గ్రామం జంక్షన్ నుంచి గొట్లాం గ్రామం వరకు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా జాతీయ రహదారి మారింది.నెలలో కనీసం ఇద్దరి నుంచి ఐదుగురి వరకు మృత్యువాత పడడం ఇక్కడ పరిపాటిగా మారింది. అందుకు నిదర్శనంగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమదాలు జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మండలంలోని జాతీయ రహదారి 26పై చందక పేట జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బొండపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌తో పాటు, యందవ ప్రణీత్‌లు బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో విజయనగరంలోని మహారాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. అలాగే మండల కేంద్రానికి సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుకనుంచి వేగంగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కాశీపట్నానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ప్రైవేట్ అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని మహారాజా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపిస్తున్నారు.



చందకపేట వద్ద జరిగిన ప్రమాదంలో108 వాహనంలో బాధితులను తరలిస్తున్న సిబ్బంది



బొండపల్లి వద్ద ఆటో, ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాశీపట్నానికి చెందిన వ్యక్తి

కొఠియా గ్రామాల్లో ఒడిశా పోలీసుల కవ్వింపు



కొఠియా పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఆంధ్రా అభివృద్ధి పనుల కోసం తీసుకువచ్చిన సామగ్రి, వ్యాన్

సాలూరు: వివాదాస్పద ఆంధ్రా, ఒడిశా సరిహద్దు కొటియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం, పోలీసుల కవ్వింపు చర్యలు కొనసాగుతున్నాయి.ఇటీవల గంజాయిభద్ర పంచాయతీ దిగువశెంబిలో అంగన్వాడీ కేంద్రానికి వచ్చి అక్కడ తెలుగులో ఉన్న బోర్డులను ఒడిశా పోలీసులు, అధికారులు తీసుకువెళ్లిన విషయం పాఠకులకు విదితమే. తాజాగా శనివారం ధూళిభద్ర వద్ద జలజీవన్ మిషన్ కింద వాటర్‌ట్యాంకు పైపుల నిర్మాణానికి తీసుకువచ్చిన వ్యాన్, సిమెంట్ సామగ్రిని వ్యాన్‌తో సహా కొఠియా పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లిపోయారు. తరువాత శనివారం రాత్రి వ్యాన్, అదుపులోకి తీసుకున్న డ్రైవర్‌ను విడిచిపెట్టి వెళ్లిపోమని కొఠియా పోలిసులు తెలిపినట్లు సమాచారం. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రా ఒడిశా కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా పోలీసులు, అధికారులు ఇలా కవ్వింపు చర్యలు చేపడుతున్నా ఆంధ్రా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ పలువురు గిరిజనుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

15 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామం సమీపంలో అక్రమంగా 15 మద్యం సీసాలను తరలిస్తున్న ఎస్.వాసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను సీజ్ చేసినట్లు సీఐ రాజశేఖరనాయుడు ఆదివారం తెలిపారు. కొత్తవలస–సబ్బవరం రోడ్డులో ఎక్సైజ్ నేరాలపై విచరాణ చేస్తుండగా నిందితుడు మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై వీఎస్.రాజు, సిబ్బంది బి.రాముడు, ప్రసాద్, బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సోమవారం విజయనగరంలో జరగబోయే కల్లు గీత కులాలకు చెందిన మద్యం షాపులకు సంబంధించి లాటరీని ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా పడినట్లు సీఐ రాజశేఖరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బొబ్బిలి: పట్టణ రైల్వేస్టేషన్‌కు వ్యక్తిగత పనుల మీద వచ్చిన వ్యక్తిని రైలు ఢీకొనడంతో గాయాలతో బయటపడ్డాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై జీఆర్‌పీ హెచ్‌సీ బండారు ఈశ్వరరావు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పక్కి గ్రామానికి చెందిన బంకురు రాము బొబ్బిలి స్వంత పనులపై రైల్వేస్టేషన్ గుండా వెళ్తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో పక్కకు తుళ్లిపోయాడు. దీంతో జీఆర్‌పీ హెచ్‌సీ 108కు సమాచారమివ్వగా సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆ వ్యక్తిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు హెచ్‌సీ ఈశ్వర రావు తెలిపారు.



గాయాలతో పడిఉన్న రాము

నేడు ప్రధాన మంత్రి మోదీతో ముఖాముఖి

- పరీక్షా పే చర్చ లైవ్ ప్రోగ్రాంకు ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు

వీరఘట్టం: ఇది పరీక్షల కాలం. పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏటా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేరుగా వారితో మాట్లాడుతున్నారు. ఈ ఏడాది కూడా విద్యార్థులతో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు పీఎం మోదీ మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి పీఎం మోదీ విద్యార్థులతో మాట్లాడేందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలల్లో స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా అన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశారు. ఇప్పుడా డిజిటల్ స్క్రీన్స్ పీఎం మోదీతో మాట్లాడేందుకు ఎంతగానో ఉపయోగపడనున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. అయితే సోమవారం నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఉన్నందున వారికి పరీక్షల అనంతరం పీఎం మోదీ ప్రసంగాన్ని యూట్యూబ్ చానెల్స్‌లో చూపించనున్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 11 గంటల నుంచి లైవ్ ప్రోగ్రాం చూపించేందుకు ఏర్పాట్లు చేశారు.

ముమ్మర ఏర్పాట్లు

పరీక్షా పే చర్చ కార్యక్రమంలో నేరుగా ప్రధాన మంత్రితో మాట్లాడేందుకు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 1,46,788 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కొద్ది రోజుల క్రితం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో పార్వతీపురం మన్యం జిల్లాలో 44,379 మంది విద్యార్థులు, 2,955 మంది ఉపాధ్యాయులు, 1,204 మంది తల్లిదండ్రులు ఉన్నారు.అలాగే విజయనగరం జిల్లాలో 89,302 మంది విద్యార్థులు, 6,429 మంది ఉపాధ్యాయులు, 2,519 మంది తల్లిదండ్రులు ఉన్నా రు. అయితే వారిలో పీఎం మోదీ ఎవరితో డైరెక్ట్‌గా మాట్లాడతారోనని అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు.



వీరఘట్టంలో సిద్ధం చేసిన డిజిటల్ స్క్రీన్

ఏర్పాట్లు పూర్తి



జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాల్లో డిజిటల్ స్క్రీన్స్ సిద్ధం చేశాం. పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా పీఎం మోదీ ప్రోగ్రాం 6–10 తరగతుల విద్యార్థులు చూసేందుకు ఏర్పాట్లు చేశాం. ఈ ప్రోగ్రాంలో ఎటువంటి అంతరాయం లేకుండా ఉపాధ్యాయులు పక్కాగా చర్యలు చేపట్టాలి.
ఎస్.తిరుపతినాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం



పరీక్షా పే చర్చ వాల్‌పోస్టర్